# ఆమె నవ్వు

వై. యన్. మూర్తి

అర్ధగంటనుంచి బస్సుకోసం ఎదురుచూస్తున్నా బస్సు రాలేదు. విసుగుపుడుతోంది. పైన ఎండ మాడుస్తోంది. కిళ్ళీకొట్టునీడకు చేరా!

"చూపులు కలిసిన శుభవేళ" అన్న రికార్డు వినబడుతోంది. విశ్రాంతి లభించింది. మనోవికాసం కల్గింది. రికార్డు వినేటప్పటికి చూపులను పరిసరాలకు ఝళ్ళించా. నాకు కొద్ది దూరంలో వున్న ఒక నవయౌవన సుందరాంగి మీద నిల్చింది నాదృష్టి. ఒక్కసారిగా మా ఇద్దరి చూపులు కలిశాయి.

ఆమె చిరునవ్వు నవ్వింది

నేనూ నవ్వాను.

ఇంకా నవ్వింది. నేనూ నవ్వాను.

నవ్వడం మానింది.

దానంతటదే ఆగింది నా నవ్వు.

కారణం ఊహాతీతం...

ఆమె నవ్వుకి కారణం వుండి తీరాలి.

ఇంతలో భీమవరం బస్సు వచ్చి ఆగింది. నేను ఎక్కబోయా. ముందు సీటు ఖాళీ లేదు. వెనుక సీట్లో కూర్చున్నా. నా కెదురుగా ఆమె (సుందరాంగి) కూడా కూర్చుంది. మనస్సు కుదుటబడింది. ఆమె నవ్వుకి కారణం తెల్సుకోడాన్కి వీలు కలుగుతుంది కదానని. మనస్సు పరిపరివిధాల పోతోంది.

బస్సు నడుస్తోంది. నా ఆలోచనకి అంతంలేదు. ఆమె ఎందుకు నవ్వాలి? నన్ను చూచే ఎందుకు నవ్వాలి? "ఎందుకు నవ్వారండి?" అని అడుగుదామనుకున్నా. నల్గురిలోను అడిగితే నవ్వులపాలు కావల్సొస్తుందని మానేశా. అయినా ఎలాగ అడగడం? ఆమెకు నాకు పరిచయం లేదు. ఆఖరికి ఎక్కడా చూడ్డంకూడా తటస్థపడలే. అడిగినా ఫలితం ఉంటుందో వుండదో? ఏమైనాసరే అడగాలనుకుని ఉద్యుక్తుణ్ణయ్యా. ఇంతలో బస్సు గోతిలోపడి పైకి లేచింది. నా ఆలోచనకి అంతరాయం కల్గింది. ఆమె వైపు చూచా. ఆమెకూడా నన్ను చూస్తోంది. ఆ తీక్షణ వీక్షణాలు మదీయ మదిలో మదనుని బాణాల్లా గుచ్చుకున్నాయి.

అవకాశం చిక్కలేదు. ఆమెను పలుకరిద్దామంటే. 'హరి భగవంతుడా! ఎటువంటి సమస్యను పెట్టావురా' అని అనుకున్నా. ఆమెతో మాట్లాడి సందేహం తీర్చుకోవాలని నిశ్చయించుకున్నా.

బస్సు గమ్యస్థానం జేరింది. ముందుగా బస్సు దిగి వెనక్కి చూశా. ఆమె అక్కడే దిగుతోందో లేక బస్సుస్టాండులో దిగుతుందోనని. ఆమె ఇక్కడ దిగితేనే నా ప్రశ్నకి జవాబుదొరికేది. లేకపోతే నాదో దారి ఆమెదో దారి.

అమ్మయ్య! నేనుకున్నట్లే ఆమెకూడా చేత్తో బ్యాగ్ పట్టుకొని మరొక చేత్తో పమిట సవరించుకుంటూ వయ్యారంగా పాదం క్రింద మోపబోయింది. బస్సు కదలబోయింది. ఆమె పాదపద్మం సరిగా నేల మీద మోపలేదు. గురి తప్పింది. ప్రక్కనే వున్న నాపైకి పడబోయింది. మనస్సును సంబాళించుకొని ఆమెను ఆదుకున్నా. గండం గడిచింది. ఆ ప్రమాదం మా యిరువురి ప్రణయానికి నాంది. ఇక షరా మామూలే!

"థ్యాంక్సు. ప్రమాదం తప్పించారు" కృతజ్ఞతగా నావైపు చూస్తూ చెప్పింది.

"ఈ మాత్రానికేనా! ప్రమాద వశాత్తు నా మీద పడ్డారు. పడకుండా పట్టుకున్నా. అంతే. దిగేవారు దిగారో లేదో తెల్సుకోకుండా స్టార్టు చేసేసాడు డ్రైవరు" అంటూ మాటలు పొడిగించా.

"ఏంచేస్తాంలేండి. లేచిన వేళ మంచిది కాబట్టి దెబ్బ తగలకుండా పట్టుకుని నా పరువు నిల్పారు" అంది. చిరునవ్వుతో.

"అలా అనకండి. మానవ హృదయం ప్రేమమయం కదండి...ఇంతకీ మీరు ఈ వూరుకి క్రొత్తనుకుంటా?" అడిగా.

"ఔనండి! ఇదే మొదటిసారి నేనీ వూరు రావడం. కాలేజీ నాటకపోటీలలో పాల్గొనడానికి ఈస్ట్ గోదావరి నుంచి వచ్చాం. నిన్ననే మా కాలేజీ వాళ్ళందరూ వచ్చారు. పాలమూరులో మా రెలిటివ్సు వుంటే నేను నిన్నక్కడ ఆగి ఈ రోజు వస్తున్నా... కాస్త కాలేజీకి వెళ్లే దోవ చెబుతారా? అని అమాయికంగా అడిగింది. "అలాగే తప్పక చూపుతా. పోనీ రిక్షాల మీద వెడదాం. నేనూ ఈ కాలేజీలోనే బీకాం చదువుతున్నా. నేనూ ఈ నాటక పోటీల్లో పాల్గొంటున్నా. మిమ్మల్ని కల్సుకున్నందుకు చాలా సంతోషం. పదండి రిక్షామీద వెడదాం కాలేజీకి" హుషారుగా చెప్పా.

ఆమెను వాళ్ళ కాలేజీ బృందం వద్ద చేర్చి, నా లాడ్జీకి వెళ్ళా. నా సమస్య, సమస్యలాగే వుంది. ఆమె మాట్లాడుతున్నంతసేపు అడగలేకపోయా. కాస్త చనువు ఏర్పడింది కాబట్టి ఆమె వెళ్ళిపోయేలోగా, ఆమె నడగవచ్చు నన్న ధైర్యం కల్గింది. సరసమైన సమాధానం దొరుకుతుందనే ఆశ.

ఆరోజే వాళ్ళ నాటకం; మా నాటకం!

గ్రీన్ రూమ్‌లోకి వెళ్ళే ముందు ఆమెను చూడ్డం తటస్థించింది. చిరునవ్వుతో పలకరించింది. పు లకరించి పోయా. నా సమస్యకు విమోచన కల్గలేదు.

నాటక పోటీలు సమాప్తమయ్యాయి. ఆ దినమే ఫలితాలు! ప్రైజెస్ యిచ్చే దినం. ప్రార్థనతో సభ ప్రారంభమైంది. ప్రేక్షక సమూహం హెచ్చుగానే వుంది. సభాధ్యక్షుల ప్రసంగం ఆయన ఉపోద్ఘాతం బంగళాఖాతం అంత వుంది. కార్యదర్శి నివేదిక పూర్తయ్యాయి. ఫలితాలు చెబుతున్నారు. ఆందోళన ఎక్కువైంది. ఆత్రుతగా ఎదురుచూస్తున్నా.

"ఈ సంవత్సరపు అంతర్ కళాశాల నాటక పోటీలలో ఉత్తములుగా ఎన్నికైన వారి పేర్లు యివి:—" ఎనౌన్స్‌మెంటు—

"ఉత్తమనటుడు శ్రీ సీతాపతి

"ఉత్తమనటి కుమారి జానకి"

ఆ సీతాపతి నేనే. ఆ ఆనందం అవధుల్ని దాటింది. స్నేహబృందం ఊపిరి సల్పనివ్వలే! బహుమతిని స్వీకరించడానికి స్టేజీ మీదకు వెళ్ళా! వారిచ్చిన వెండికప్పును తీసుకొని కృతజ్ఞత తెల్పా.

ఇంతలో ఉత్తమనటిగా ఎన్నికై నిర్ణయించబడిన కుమారి జానకి స్టేజీ మీదకు వచ్చింది. ఆమె ఎవరో కాదు. నన్ను నవ్వించిన యువతే. ఆమెకూడా కప్పు తీసుకుంది. చిరునవ్వు నవ్వింది. నన్ను చూచే! చలించా! భ్రమించా. మమ్మల్నిరువురిని చూచేటప్పటికి ప్రేక్షకలోకంలో ప్రళయం బయలుదేరింది. ఆ ప్రళయం మా ప్రణయానికి దోహదమిచ్చింది. మానవ్వులతో ప్రశాంతిని చేకూర్చాం. అదే మా కాలేజీ విద్యార్థి, విద్యార్థినీ లోకానికి కావల్సింది. మేమిరువురం స్టేజీ దిగాం. అతిప్రయాసమీద స్టేజీకి వెనుకనున్న జీడి మామిడి తోపువద్దకు, అప్రేమయంగా మా కాళ్ళు నడిచాయి.

"కంగ్రాచ్యులేషన్సు! సీతాపతిగారూ. మీ విజయానికి!.. నేను ఉత్తమనటిగా ఎన్నిక కావడాన్కి మీరే కారణం" అంది జానకి.

"నా విషయంలో కూడా మీరు కారణభూతలు" అన్నా ధీమాగా.


"ఎలా చెప్మా!" ప్రశ్నించింది.

"అలా కూర్చోండి, చెబుతా! మా నాటకంలోని ఒక సన్నివేశంలో కథానాయిక నవ్వగా నేనూ ప్రేమను వ్యక్తపరుస్తూ నవ్వాలి. కాని ఆ నాయికగా నటించింది నారూమ్‌మేట్ రామం. నా దృష్టిలో రామంగానే మెదులుతాడు. ఎంత ఆడవేషం వేసినా వాడి నవ్వులో మార్దవంలేదు. వాడి చూపులో ఆకర్షణలేదు. నా దృష్టిలో

జానకి స్టేజీమీదకు వచ్చింది. ఆమె ఎవరోకాదు. నన్ను నవ్వించిన యువతే. ఆమెకూడా కప్పు తీసుకుంది. చిరునవ్వు నవ్వింది... నన్ను చూచే! చలించా! భ్రమించా! మమ్మల్నిరువురిని చూచేటప్పటికి ప్రేక్షకలోకంలో ప్రళయం

శశిగా మెదలడు. అందుకే వాడు నవ్వినా నేను నవ్వ లేకపోయేవాడిని. కాని, నిన్న స్టేజీమీద, మొన్న పొద్దునబస్సుకోసం ఎదురుచూస్తూ నన్ను చూసి నవ్వారే, ఆ నవ్వుని, ఆ ముఖారవిందాన్ని దృష్టిలో పెట్టు కొన్నందుకే నవ్వగలిగా. మూడ్‌లోకి రాగలిగా. బహుమతి పొందగలిగా! మీ మేలు మర్చిపోలేను. మరి, నేనెలా కారకుణ్ణి మీ విషయంలో?'' అడిగా!

చాలా విచిత్రంగా వుందండి. మా నాటికలో అంతా ఆడవాళ్ళమే! నేను కథానాయకుణ్ణి. ఒక్క వంకరనవ్వుతో,




ఒక్క కోరచూపుతో ముగ్గుణ్ణి చెయ్యాలి. కాని తోటిస్త్రీ పురుషవేషం దాల్చినా, నాదృష్టిలో స్త్రీయే! అందుకే నా నవ్వు హేళన చేస్తున్నట్లుండేది. ఎంత ప్రయత్నించినా మొన్న మిమ్మల్ని బస్టాండులో, మా నాటికలోని కథానాయకుడిగా తల్చుకుని నవ్వుదామనుకున్నా. ఆ నవ్వుని ఆపుకోలేక పైకే నవ్వేశా. మీరు నవ్వారు. ఆ సన్నివేశాన్ని దృష్టిలో వుంచుకోవడంవల్ల హీరోని చూచి నవ్వగలిగా. హీరోయిన్‌గా నటించగలిగా!'' వివరంగా చెప్పింది.

''ఇంతకీ ఆనాడు నవ్విన నవ్వుకి ఇదా కారణం! చంపారు పొండి. మొన్నటినుండి ఈ సమస్యతో తల పగలకొట్టుకుంటున్నా! తేలిగ్గా నవ్వేస్తూ చెప్పా.

''ఒకరికి ఒకరం తోడ్పడుకొని విజయాన్ని సాధించాం!''

''నాటకంలోనే కాదు నిజ జీవితంలో కూడా మనంకలిసి విజయాన్ని సాధించవచ్చు. మీ సహకారంవుంటే చూచారు! ఈ జీడిమామిడి తోపువద్ద మన యిద్దరి సన్నివేశం నాకు బాగా నచ్చింది.... మరి... మీకు?'' మనసులో మాట అడిగేశా.

'' వేరే ,చెప్పాలా?'' సిగ్గుతో ఆమె బుగ్గలు ఎర్రబడ్డాయి.

అయితే త్వరలో మీ నాన్నగారితో చెప్పి ముహూర్తం పెట్టిస్తా!'' ఆనందంగా చెప్పా.

వంచిన ఆమె ముఖాన్ని పైకెత్తి పరికించా. ''అప్పుడే పెళ్ళికళ వచ్చిందే'' అన్నా.

ఆమె నవ్వింది... మధురంగా...

ఒక శుభముహూర్తాన ఈ సీతాపతి జానకీపతి అయ్యాడు. *